క్లుప్తంగా

న్యాయవాదిపై దాడి హేయం

కొత్తగూడెంటౌన్: రాజకీయ వైషమ్యాల నేపథ్యంలో న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు యుగంధర్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌కుమార్ మక్కడ్ తెలిపారు. సోమవారం జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలపగా రమేశ్‌కుమార్‌మక్కడ్ మాట్లాడారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం దళిత బంధు పథకంలో జరిగిన అవకతవకలపై ప్రశ్నించినందకు యుగంధర్‌పై దాడి జరిగిందని, దీనికి ఖండిస్తున్నామని తెలిపారు.

దాబాలను రాత్రి 10.30 వరకు తెరిచి ఉంచొద్దు..


యజమానులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేశ్

పాల్వంచరూరల్: పాల్వంచ పట్టణ శివారు జాతీయ రహదారి పక్కన ఉన్న దాబాలను రాత్రి 10.30 గంటల తర్వాత తెరిచి ఉంచడం నిషేధమని, మద్యం విక్రయించినా, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్‌ఐ నరేశ్ హెచ్చరించారు. సోమవారం జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న దాబాల యజమానులతో సమావేశం నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా దాబాలను నిర్వహిస్తే సహించేదిలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో దాబాల యజమానులు శంకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

యువతను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

ఇల్లెందురూరల్: ఉద్యోగాల భర్తీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను మోసం చేస్తున్నాయని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి మోకాళ్ల రమేశ్ ఆరోపించారు. జూన్ 5, 6 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే పీవైఎల్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఖాళీల సంఖ్యకు అనుగుణంగా పోస్టులను భర్తీ చేయడం లేదని, ప్రశ్నపత్రాలను లీక్ చేస్తూ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు రావూరి ఉపేందర్, లక్ష్మణ్, వెంకటేశ్, కన్నయ్య, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు తనిఖీ

టేకులపల్లి: జిల్లా పరిషత్ ప్రత్యేక నిధులు రూ.55 లక్షలతో మండలంలోని రోళ్లపాడు పంచాయతీలో 3, గంగారంలో 2, మేళ్లమడుగులో 2, రాంపురంలో 1, బిల్లుడుతండాలో 1, కిష్టారంలో 1, తావుర్యాతండాలో 1 మొత్తం ఒక్కో సీసీ రోడ్డుకు రూ.5 లక్షలు చొప్పున 11 రోడ్లు వేశారు. సోమవారం ఎంపీడీఓ కోట వీరబాబు ఆధ్వర్యంలో ఏడు గ్రామ పంచాయతీల్లో నిర్మించిన 11 సీసీ రోడ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్థానిక ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ గణేశ్‌గాంధీ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ధనియాలపాడులో కంటివెలుగు శిబిరం

ఇల్లెందురూరల్: మండలంలోని ధనియాలపాడు గ్రామపంచాయతీలో కంటివెలుగు శిబిరాన్ని సోమవారం సర్పంచ్ నూనావత్ తిరుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటికి సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు కంటివెలుగు శిబిరం వరంలాంటిదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ శిబిరానికి హాజరై కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హర్షిణి, సిబ్బంది పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మకు ఘన నివాళులు


నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ వీరబాబు

టేకులపల్లి: దళిత వైతాళికుడు, ఆంధ్రసభ స్థాపకుడు భాగ్యరెడ్డివర్మ జయంతిని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. సోమవారం ఎంపీడీఓ కోట వీరబాబు ఆధ్వర్యంలో భాగ్యరెడ్డివర్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 1906–1933 మధ్య కాలంలో హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలిక పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి పునాదులు వేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ గణేశ్‌గాంధీ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, జయకృష్ణ, మౌలానా పాల్గొన్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు!

- రహదారి విస్తరణ కోసం నరికివేత
- కనుమరుగవుతున్న దశాబ్దాల నాటి వృక్షాలు
- నీడ లేక బోసిపోయి కనిపిస్తున్న రహదారులు


తొలగించిన వృక్షాల మోడులు


వృక్షాల తొలగింపుతో కళావిహీనంగా మారిన సుజాతనగర్ సమీపంలోని రహదారి

సుజాతనగర్: హరితహారం పేరుతో ఓ వైపు ప్రభుత్వం మొక్కలు నాటుతుండగా.. రాష్ట్రీయ రహదారి విస్తరణ కోసం మరోవైపు భారీ వృక్షాలను నేలకూలుస్తున్నారు. సుజాతనగర్‌లో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర నిర్మించనున్న నాలుగు లేన్ల రహదారి విస్తరణలో రోడ్డుకిరువైపులా ఉన్న భారీ వృక్షాలను తొలగిస్తున్నారు. భద్రాచలం రోడ్డు నుంచి సత్తుపల్లి రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా 12వ రాష్ట్రీయ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ఈ మేరకు స్థానిక గాయత్రీనగర్ వద్ద రైల్వే లైన్ ఏర్పాటైన నేపథ్యంలో వాహనాల రాకపోకలకు అనుగుణంగా ఆర్వోబీతో పాటు ప్రస్తుతం ఉన్న రహదారిని నాలుగు లేన్లుగా విస్తరిస్తున్నారు. ఇందులో భాగంగా భారీ వృక్షాలను తొలగిస్తుండగా.. దశాబ్దాల కాలం నుంచి నీడనిస్తున్న చెట్ల తొలగింపుతో రహదారి కళావిహీనంగా మారింది.

వాళ్లు నాటారు.. వీళ్లు తొలగిస్తున్నారు..

అధికారుల అవగాహన లోపం.. హరితహారం మొక్కలకు శాపంగా మారింది. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో అవెన్యూ ప్లాంటేషన్ కింద సుజాతనగర్ నుంచి మంగపేట వరకు రహదారికి ఇరువైపులా వందల సంఖ్యలో మొక్కలు నాటారు. రెండేళ్ల కిందట నాటిన మొక్కలను ఇప్పుడు విస్తరణలో తొలగిస్తున్నారు. పచ్చదనాన్ని మండల వాసులు ఆస్వాదించేలోగానే రోడ్డు విస్తరణ కారణంగా తొలగిస్తుండడం గమనార్హం. దీంతో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఉపాధి కోల్పోయిన వీధి వ్యాపారులు..

వేపలగడ్డ, సుజాతనగర్ తదితర గ్రామాల్లోని కొందరు ఉపాధి కోసం ఈ రహదారి పక్కనే చెట్ల కింద చిరువ్యాపారం చేసుకునేవారు. ఎన్నో ఏళ్లుగా పండ్లు, కూరగాయలు తదితర వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేసి తెచ్చి ఇక్కడ విక్రయించి వేసవిలో కరువును జయిస్తున్నారు. ఇప్పుడు వీరి పరిస్థితి దయనీయంగా మారింది. వీరి దుకాణాలను తొలగించడంతో వీధి వ్యాపారులు రోడ్డున పడ్డారు.

నో ట్రాన్స్‌ప్లాంటేషన్..

రోజురోజుకు అంతరించిపోతున్న అడవులను కాపాడేందుకు 1994లో ట్రాన్స్‌ప్లాంటేషన్ చట్టాన్ని కేంద్రప్రభుత్వం తీసుకొచ్చింది. తప్పనిసరి పరిస్థితుల్లో చెట్లను తొలగించాల్సి వస్తే ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలి. అలా చేయకుండానే చెట్లను తొలగించడం పట్ల పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూలి పనులకు వెళ్తున్నా


గతంలో వేసవికాలం వచ్చిందంటే చాలు పూట గడవడం కష్టంగా ఉండేది. కానీ ఐదేళ్లుగా రహదారి పక్క పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు రోడ్డు విస్తరణతో మా దుకాణాన్ని తొలగించారు. వేరే దారి లేక మళ్లీ ఎండను లెక్క చేయకుండా కూలి పనులకు వెళ్లాల్సి వస్తోంది.

–కత్తి బాలకృష్ణ, పండ్ల వ్యాపారి

ప్రత్యామ్నాయం చూపాలి


ఎనిమిదేళ్లుగా పండ్ల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. రోడ్డుపై వెళ్లే వాహనదారులు పండ్లు కొనుగోలు చేస్తుంటారు. రోజులో రూ.వెయ్యి వరకు సంపాదన ఉండేది. ఇప్పుడు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ప్రభుత్వం ఆలోచించి మా లాంటి వారికి ప్రత్యామ్నాయం చూపాలి.

–వేముల రాము, పండ్ల వ్యాపారి

రీయింబర్స్‌మెంట్‌ను వినియోగించుకోండి..

ఇల్లెందు: గృహ నిర్మాణ రుణ వడ్డీ రీయింబర్స్‌మెంట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం షాలేమురాజు కోరారు. సోమవారం ఇల్లెందు జీఎం కార్యాలయంలో హెచ్‌బీ ఆర్‌ఐఆర్‌ఎస్ సమీక్షలో వివరాలు వెల్లడించారు. గనులు, విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు గృహ నిర్మాణ రుణ వడ్డీ పథకం ద్వారా రీయింబర్స్‌మెంట్ ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. నెలాఖరు నాటికి దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ఓపెన్ జిమ్ సందర్శన

జేకే హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఏరియా పర్సనల్ అధికారి జీవీ మోహన్‌రావు సందర్శించి పరిశీలించారు. ఈ ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట డిప్యూటీ పర్సనల్ మేనేజర్ జి.శ్రీహరి, సీనియర్ పర్సనల్ అధికారి సాయిస్వరూప్ ఉన్నారు.

కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న పోట్ల


సమావేశంలో పోట్ల నాగేశ్వరరావు, నాయకులు

కొత్తగూడెంరూరల్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం జరిగిన టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు. సమావేశంలో ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ సభ్యులు, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరి, మాలోత్ రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.

వనమాను విమర్శించేస్థాయి లేదు..

హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావుపై బీఆర్‌ఎస్ నేతల ధ్వజం


మాట్లాడుతున్న కంచర్ల చంద్రశేఖర్‌రావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): 'ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు రాజకీయ ప్రస్థానమంత వయస్సు లేదు.. అధికారం అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తావా.. దమ్ముంటే ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి రా' అని హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావుకు బీఆర్‌ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు సవాల్ విసిరారు. స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి మాట్లాడారు. వనమాపై మరోసారి విమర్శలు చేస్తే పొలిమేర వరకు తరిమి కొడతామని హెచ్చరించారు. జనం సొమ్ముతో జీతం తీసుకుంటూ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. అక్రమంగా కరోనా సమయంలో సంపాదించిన డబ్బుతో అహంకారంగా ప్రవర్తించడం సరికాదని హితవు చెప్పారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. ఆయన ఒక్కో సమావేశంలో ఒక్కోరకంగా మాట్లాడుతారని, శనివారం వచ్చి సోమవారం వెళ్లే వ్యక్తికి రాజకీయాలు ఏం తెలుసని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కిలారు నాగేశ్వరరావు, బరపటి వాసు, జేవీఎస్ చౌదరి, అన్వర్‌పాషా, రజాక్, వెంకట్, శ్రీధర్ పాల్గొన్నారు.

గొత్తికోయలను ప్రభుత్వం గుర్తించాలి


మాట్లాడుతున్న సాబీర్‌పాషా

చుంచుపల్లి: వివిధ రాష్ట్రాల నుంచి వలసవచ్చి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో స్థిరపడిన ఆదివాసీ వలస గొత్తికోయలను రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి పౌరులుగా గుర్తించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా కోరారు. చుంచుపల్లి మండల పరిధిలోని మర్రిగూడెం, జగ్గారం, గడ్డిగుట్ట, పాలవాగు తదితర గొత్తికోయల గుంపు గ్రామాలను సోమవారం సీపీఐ ప్రతినిధి బృందం సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో సాబీర్‌పాషా మాట్లాడారు. 30 ఏళ్ల కిందట ఇక్కడికి వచ్చి స్థిర నివాసాలు ఏర్పర్చుకున్న వీరికి కుల, నివాస, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. ఆయా సమావేశాల్లో బందెల నర్సయ్య, గుత్తుల సత్యనారాయణ, వాసిరెడ్డి మురళి, సీడాల సుధాకర్, కట్టా పుల్లయ్య, వీరభద్రం, ఉదయ్, నాగరాజు, విశ్వనాథం, చెన్నారావు, పాల వెంకటేశ్వర్లు, గొత్తికోయలు భీమయ్య, నంద, అడమయ్య, బాలరాజు, నంద తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిని పరిరక్షించుకుందాం..

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్రానికి తలమానికంగా ఉన్న సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం చేస్తున్న కుట్రపై కార్మికులు తిరగబడి సంస్థను పరిరక్షించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. సింగరేణి జీకేఓసీ, ఆర్‌సీహెచ్‌పీ, సివిల్ డిపార్ట్‌మెంట్లలో సోమవారం జరిగిన ఏఐటీయూసీ పిట్ కమిటీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మిర్యాల రంగయ్య, దమ్మాలపాటి శేషయ్య, వీరస్వామి, బందెల నర్సయ్య, వి.మల్లికార్జున్‌రావు, గట్టయ్య, ఉమాయున్, శ్రీనివాస్, ఎం.రవి, కత్తెర్ల రాములు, భూక్య రమేశ్ పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

సుజాతనగర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. నాయకులగూడెంలో మిషన్ భగీరథ నీళ్ల సరిపోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆ గ్రామ సర్పంచ్ మండె నాగరాజేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమస్య మండలవ్యాప్తంగా నెలకొందని పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మిషన్ భగీరథ అధికారులను ప్రశ్నించారు. ప్రతీసారి జరిగే సమావేశంలో తాగునీటి సమస్య ఉందని చెబుతున్నా పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏంటని గరీబ్‌పేట, నాయకులగూడెం ఎంపీటీసీ సభ్యులు నిలదీశారు. తొలుత ఎంపీపీ మాట్లాడుతూ అన్ని గ్రామాలకు తాగునీరు అందించాలని, అధికారుల సమన్వయంతో అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటలక్ష్మి, మండె వీరహనుమంతరావు, రాంబాబు, మానస, పద్మ, భద్రం, శివలాల్, మీరాంబీ, సుధతి, రమాదేవి, నర్మద పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ విగ్రహాల ఆవిష్కరణ

జూలూరుపాడు: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం జూలూరుపాడులోని చండ్రుగొండ క్రాస్‌రోడ్డు, వినోభానగర్ గ్రామంలో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో కూరపాటి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి రామనాథం, అరెం రామయ్య, అరెం వరలక్ష్మి, రోకటి రంగారావు, కనకాల సాంబశివరావు, ఝాన్సీ, కత్రం స్వామిదొర, చలమల గోవిందు, వడ్డె వెంకటనారాయణ, రోకటి నరసింహారావు, తుమ్మలపల్లి వెంకటేశ్వర్లు, కోటం రాజు, పాదిలి రామారావు, దుద్దుకూరి లక్ష్మణ్‌రావు, సాయిన్ని నాగేశ్వరరావు, అనిల్, కందిమళ్ల అప్పారావు, యల్లంకి శ్రీనివాసరావు, సిరికొండ తిరుమల్‌రావు, నరసింహారావు, ముదిగొండ రాంబాబు, చెరుకూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆత్మలింగేశ్వరస్వామిని దర్శించుకున్న స్వాములు

పాల్వంచరూరల్: గంగోత్రి నుంచి రామేశ్వరం (రామ్‌సేత్) వరకు సాష్టాంగ నమస్కారంతో కనక దండావత్ సేత్ బంద్ యాత్రను చేపట్టి నాలుగువేల కిలోమీటర్ల యాత్రను పూర్తి చేసుకుని మార్గ మధ్యలోని శ్రీ ఆత్మలింగేశ్వర స్వామి ఆలయాన్ని సాధుస్వాములు సోమవారం దర్శించుకున్నారు. అనంతరం వారి యాత్రను సాగించారు.

ప్రతిభ చూపిన విద్యార్థినికి సన్మానం


నాగభవ్యశ్రీని సత్కరిస్తున్న దృశ్యం

ఇల్లెందు: ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 470/467 మార్కులు సాధించిన ఎల్‌బీనగర్‌కు చెందిన నాగభవ్యశ్రీని ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గౌరిశెట్టి కృష్ణ, పాబోలు మణికిరణ్, ఎలుగూరి వినోద్‌బాబు, నగేశ్, మైలవరపు బసవయ్య, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించడంలో విఫలం

సుజాతనగర్: కొత్తగూడెం నియోజకవర్గంలోని ప్రజలకు తాగునీరు అందించడంలో పాలకులు విఫలమయ్యారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ ఆరోపించారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో సర్వారం గ్రామ పంచాయతీ గొల్లగూడెం గ్రామంలో సోమవారం పర్యటించి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. కార్యక్రమంలో మాలోత్ వీరూనాయక్, పాయం శారద, బట్ట మోహన్‌కృష్ణ, సుమంత్, సుధాకర్, మధు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకోవాలని బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధులు లకావత్ గిరిబాబు, షేక్ అన్వర్ కోరారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను జిల్లాలో విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మోరె భాస్కర్, మురళి, యాంపాటి సందీప్‌రెడ్డి, పోతురాజు రవి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పాల్వంచరూరల్: మండలంలోని సత్యనారాయణపురం గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న చీట్ల వెంకటయ్య (65) సోమవారం మృతి చెందాడు. దహన సంస్కారాల నిమిత్తం జీపీ నిధుల నుంచి రూ.10 వేలు ఎంపీఓ నారాయణ మృతుడి భార్య మంగమ్మకు అందించారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే మండలంగా కొమరారం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన ఉందని, త్వరలోనే కొమరారం కేంద్రంగా నూతన మండలం ఆవిర్భవిస్తుందని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ హామీ ఇచ్చారు. మండలంలోని కొమరారం గ్రామంలో ఏజెన్సీ గ్రామ పంచాయతీల ఆత్మీయ సమ్మేళనం బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు శీలం రమేశ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భవించిన తరువాత సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల జీవన విధానంలో మార్పు తీసుకొచ్చాయన్నారు. తాను కూడా అభివృద్ధిని ఆకాంక్షించే బీఆర్‌ఎస్‌లో చేరానని, ఫలితంగానే కనివినీ ఎరుగని స్థాయిలో నిధులు తీసుకొచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి ఖర్చుచేశానని వివరించారు. అంతకు ముందు బీఆర్‌ఎస్ కార్యకర్తలు భారీ ర్యాలీతో ఎమ్మెల్యేను సభా ప్రాంగణానికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావుతోపాటు జనగం కోటేశ్వరరావు, బందారు శ్రీనివాస్, ప్రమోద్, శ్రీనివాసరెడ్డి, ఖమ్మంపాటి రేణుక, లష్కర్, కుంజ కృష్ణ, మల్సూర్, తాండ్ర నాగరాజు, రెంటాల సదా, గిన్నారపు రాజేశ్, ముస్తఫా పాల్గొన్నారు.

మంత్రి అజయ్‌ను కలిసిన ఎమ్మెల్యే

ఇల్లెందు: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను ఖమ్మంలోని ఆయన స్వగృహంలో ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం బీఆర్‌ఎస్ పట్టణ నాయకులతో కలిసి ఖమ్మం వెళ్లిన హరిప్రియ మంత్రి అజయ్‌ను కలిసి త్వరలో పట్టణంలో జరగబోయే ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు.

వేజ్ బోర్డు కల నెరవేరింది..


మాట్లాడుతున్న త్యాగరాజు

టేకులపల్లి: సింగరేణి కార్మికుల వేజ్‌బోర్డు కల నెరవేరిందని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య అన్నారు. మండలంలోని కోయగూడెం ఓసీ వద్ద సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11వ వేజ్‌బోర్డు సమావేశంలో తమ యూనిట్ తరఫున వాసిరెడ్డి సీతారామయ్య పాల్గొనగా ఒప్పందం సంతకాలు చేశారన్నారు. అన్ని అడ్డంకులను అధిగమించి ఐదేళ్ల కాల పరిమితితో మెరుగైన వేతన ఒప్పందం సాధించుకోగలమని తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే కొత్త జీతాలు జూలై 1వ తేదీన ఇచ్చేలా కోల్ ఇండియా చైర్మన్ అంగీకరించారని చెప్పారు. ఎండీ నజీర్ అహ్మద్, గుగులోత్ కృష్ణ, కుమ్మరి రవీందర్, బానోతు బాలాజీ, సర్వర్, సామల శ్రీనివాస్, వెంకటనర్సయ్య, వెంగల రవి, షబ్బీర్, కనకరాజు, లక్ష్మయ్య, ఖయ్యూం, బండి సీతారాములు, వలీ, ఖాదర్, సలీం, రామకృష్ణాచారి, శ్రీనివాస్, విజయ్, కల్యాణ్, పాషా, అశోక్ పాల్గొన్నారు.

జేవీఆర్‌ఓసీ ఎదుట ఐఎన్‌టీయూసీ గేట్ మీటింగ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జేవీఆర్‌ఓసీ ఎదుట సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. కోల్‌కతాలో రెండురోజులపాటు జరిగిన జేబీసీసీఐ సమావేశంలో సెక్రటరీ జనరల్, పర్మనెంట్ వేజ్‌బోర్డు సభ్యులు జనక్‌ప్రసాద్ 11వ వేతన ఒప్పందంపై జరిగిన చర్చను, ఒప్పందాలపై చేసిన సంతకాలను సెక్రటరీ త్యాగరాజు వివరించారు. కార్యక్రమంలో కె.ఆల్బర్ట్, రావి నాగేశ్వరరావు, ప్రసన్న, తిరుమల్‌రావు, సక్రు, బాలాజీ, బాజీ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

జూలూరుపాడు: నిరుపేదలందరికీ ఇళ్లస్థలాలు కేటాయించి, డబుల్ బెడ్రూం ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్కే ఉమర్ డిమాండ్ చేశారు. సోమవారం పడమటనర్సాపురంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. డ్వాక్రా సంఘాల్లోని ప్రతి మహిళకు రూ.10 లక్షలు వడ్డీ లేని రుణాలు, అర్హులకు రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. కె.సురేందర్, వల్లోజి రమేశ్, కె.పద్మ, పి.కమల, జి.శేషు, సత్యావతి, రెడ్డి, ఎస్కే హసీనా, ఇస్మాయిల్, భూక్యా శారద, శ్రీరాందాస్, పుల్లమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం

పాల్వంచ మండలంలోని తోగ్గూడెం ప్రధాన రహదారి పక్కన గల మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం వద్ద ఎండిపోయిన భారీ వృక్షం కూలిపోయేస్థితిలో ఉంది. నీటి శుద్ధి కేంద్రంలో కార్మికులు, ఉద్యోగులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో చెట్టు ఎప్పుడు కూలుతుందోనని బిక్కుబిక్కుమంటున్నారు. అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే ఎండిన చెట్టును తొలిగించాలని కార్మికులు కోరుతున్నారు.

పాల్వంచరూరల్:



ప్రశ్నించాల్సిన అధికారి: సాయి, మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రం డీఈ
సెల్‌నంబర్: 91001 22298